www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

శుక్రవారం
ఆగస్టు-14-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 214

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 5

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



- త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం
- నూతన కమిటీకి అభినందనలు
- టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ



4




# మృత్యువుకు దారి జాతీయ రహదారి!

**హైవే 65పై మృత్యుఘోష..**
**సంగారెడ్డి జిల్లాలో వరుస ప్రమాదాలు**

**ప్రాణాలు తీస్తున్న ఆరు లేన్ల విస్తరణ పనులు**
**అధికారుల నిర్లక్ష్యానికి సామాన్యులే బలిపశువులా ?**

3

సంగారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి-65 మృత్యుకుహారంగా మారుతోంది. నిత్యం వేలాది వాహనాలు పరుగులు తీసే ఈ రహదారిపై భద్రతా ప్రమాణాలు గాలి కొదిలేయడంతో వరుస ప్రమాదాలు ప్రాణాలను బలిగొంటున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన రెండు ఘోర ప్రమాదాల్లో ఏకంగా తొమ్మిది మంది దుర్మరణం పాలవడం హైవేపై నెలకొన్న ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతోంది. సత్వర్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఏడుగురు వలస కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా.. కావేలి వద్ద కారు డివైడర్‌ను ఢీకొని అవతలి వాహనాలపైకి దూసుకెళ్లడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఓవర్‌స్పీడ్‌తోపాటు ఆరు లేన్ల విస్తరణ పనుల్లో శాస్త్రీయత లేని మలుపులు, ప్రమాదకర యూటర్న్‌లు, హెచ్చరిక బోర్డులు-రిఫ్లెక్టర్లు లేకపోవడం, రాత్రివేళ లైటింగ్ కొరత, భారీ వాహనాల అక్రమ పార్కింగ్ ప్రమాదాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. మరి ప్రమాదాలు జరిగాక స్పందించడమేనా.. ప్రాణాలు పోకముందే భద్రతా చర్యలు చేపట్టేదెప్పుడు? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్):



5

## వై జంక్షన్ మూసివేతకు చర్యలు ప్రారంభం

**బీజేపీ సుదీర్ఘ పోరాటం ఫలితం**

- సర్వీసు రోడ్డు ద్వారా నేరుగా రామాయంపేటకు చేరుకోవచ్చు
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న మైన శ్రీనివాస్

## నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**





సంగారెడ్డి, ఆగస్టు 13: ఈనెల 15న సంగారెడ్డి పట్టణానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్న విషయం తెలిసిందే. సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ గార్ల విగ్రహాలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డిలు విగ్రహాలు నెలకొల్పిన స్థలాన్ని అధికారులు,నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతున్న నేపథ్యం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఏర్పాట్లను అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ సమయం లో సీఎం తో పాటు ఎవరెవరు పాల్గొంటారో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి అంజనేయులు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నాయకులు రఘు గౌడ్,జార్జ్, కూన సంతోష్,కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్, ప్రవీణ్ , సందీప్ రెడ్డి, మొగులయ్య, ఖలీల్ పాల్గొన్నారు.





# భారీ కంటైనర్ లారీ - మినీ ఆటో ఢీ

### ఒకరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం

### ముగ్గురూ పాల వ్యాపారులే

### కిలోమీటరు మేర నిలిచిన వాహనాలు

గుమ్మడిదల, ఆగస్టు 13 (సిరి న్యూస్): భారీ కంటైనర్ లారీ, మినీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 765డీ ప్రధాన రహదారిపై గురువారం చోటుచేసుకుంది. నల్లవల్లి బస్టాండ్ సమీపంలోని మేడలమ్మ టెంపుల్ కమాన్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం నర్సాపూర్ వైపు నుంచి పెద్ద పైపులను తరలిస్తున్న భారీ కంటైనర్ లారీ మేడలమ్మ టెంపుల్ కమాన్ వద్దకు చేరుకోగానే, ఎదురుగా వస్తున్న నిత్యం పాలను తరలించే మినీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురిలో శివకుమార్ అనే వ్యక్తి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దయానంద్, సతీష్ తీవ్రంగా గాయపడటంతో వెంటనే అంబులెన్స్‌లో సూరారం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుడు శివకుమార్‌తో పాటు గాయపడిన దయానంద్, సతీష్‌ది నర్సాపూర్ మండల పరిధి లోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వారిని స్థానికులు తెలిపారు. ముగ్గురూ మిత్రులని, ప్రతిరోజూ గ్రామం నుంచి పాలను సేకరించి పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ పాల వ్యాపారం చేసేవారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు గుమ్మడిదల ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు.






### ప్రమాదాన్ని గమనించిన ఎమ్మెల్యే

ప్రమాదం జరిగిన సమయంలో అటువైపు నుంచి వెళ్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఘటనను గమనించి వెంటనే స్పందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేందుకు సహకరించారు. వెంటనే సంఘటన స్థలానికి అంబులెన్సులు చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.



### ★కిలోమీటరు మేర నిలిచిపోయిన ట్రాఫిక్★

ప్రమాదంలో భారీ కంటైనర్ రహదారిపై నిలిచి పోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రధాన రహదారిపై దాదాపు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న గుమ్మడిదల పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



## ప్రాణాపాయ స్థితిలో వచ్చిన బాబుకు

# ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావు

**రామాయంపేట, ఆగస్టు 13 (సిరి న్యూస్)** ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి తీసుకొచ్చిన నవజాత శిశువుకు వైద్యులు అందించిన చికిత్సతో కోలుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్న శంకరంపేట మండలం కామారం గ్రామానికి చెందిన పాట్లూరి శోభ -చంటి దంపతులకు ఈ నెల 5న మెదక్‌లోని ఓ ఆస్పత్రిలో బాబు జన్మించాడు. రెండు రోజుల అనంతరం బాబు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెదక్ వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే బాబు తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తీసుకెళ్లకుండా రామాయంపేట పట్టణంలోని రాజరాజేశ్వరి పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నెల 7న డాక్టర్ ప్రదీప్ రావు నేతృత్వంలో వైద్యులు చికిత్స ప్రారంభించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాబుకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. గురువారం బాబు పూర్తిగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బాబును రాజరాజేశ్వరి పిల్లల ఆస్పత్రికి తీసుకురాగా, డాక్టర్ ప్రదీప్ రావు అందించిన వైద్యం, సిబ్బంది సహకారంతో బాబు కోలుకున్నాడని ఆనందం వ్యక్తం చేశారు. తమ బాబుకు ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావుతో పాటు ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.







# మృత్యువుకు దారి జాతీయ రహదారి!

**హైవే 65పై మృత్యుఘోష.. సంగారెడ్డి జిల్లాలో వరుస ప్రమాదాలు**

**ప్రాణాలు తీస్తున్న ఆరు లేన్ల విస్తరణ పనులు అధికారుల నిర్లక్ష్యానికి సామాన్యులే బలిపశువులా ?**




**సంగారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి–65 మృత్యుకుహారంగా మారుతోంది. నిత్యం వేలాది వాహనాలు పరుగులు తీసే ఈ రహదారిపై భద్రతా ప్రమాణాలు గాలికొదిలేయడంతో వరుస ప్రమాదాలు ప్రాణాలను బలిగొంటున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన రెండు ఘోర ప్రమాదాల్లో ఏకంగా తొమ్మిది మంది దుర్మరణం పాలవడం హైవేపై నెలకొన్న ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతోంది. సత్వర్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఏడుగురు వలస కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా.. కావేలి వద్ద కారు డివైడర్‌ను ఢీకొని అవతలి వాహనాలపైకి దూసు కెళ్లడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఓవర్‌స్పీడ్‌తోపాటు ఆరు లేన్ల విస్తరణ పనుల్లో శాస్త్రీయత లేని మలుపులు, ప్రమాదకర యూటర్న్‌లు, హెచ్చరిక బోర్డులు–రిఫ్లెక్టర్లు లేకపోవడం, రాత్రివేళ లైటింగ్ కొరత, భారీ వాహనాల అక్రమ పార్కింగ్ ప్రమాదాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. మరి ప్రమాదాలు జరిగాక స్పందించడమేనా.. ప్రాణాలు పోకముందే భద్రతా చర్యలు చేపట్టేదెప్పుడు? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.**

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్): సంగారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి 65 మృత్యుకుహారంగా మారింది. నిత్యం వేలాది వాహనాలతో బిజీగా ఉండే ఈ హైవే అమాయక ప్రయాణికుల పాలిట యమపాశంగా మారుతోంది. మంగళవారం రాత్రి జిల్లా పరిధిలో జరిగిన రెండు ఘోర ప్రమాదాలు పలు కుటుంబాల్లో తీరని చీకట్లను నింపాయి. మొగడంపల్లి మండలం సత్వర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న ఒక ఆటోను, ఎదురుగా అతివేగంతో వచ్చిన ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు కర్ణాటకకు చెందిన వలస కూలీలు అక్కడికక్కడే మరణించారు. అలాగే హైవేపై కావేలి గ్రామ పరిధిలో జరిగిన మరో ప్రమాదంలో నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఒక కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి వైపు వస్తున్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. నాలుగు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పోలీస్, జాతీయ రహదారుల సంస్థ రికార్డుల ప్రకారం, తెలంగాణలోనే అత్యధిక ప్రమాదాలు జరిగే అత్యంత ప్రమాదకరమైన రోడ్డుగా జాతీయ రహదారి 65 రికార్డుకెక్కింది. హైవేపై వాహనాలు నియంత్రణ లేని వేగంతో దూసుకుపోవడమే ప్రమాదాలు జరుగుతున్నాయి. లింగంపల్లి నుంచి సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు జరుగుతున్న ఆరు లేన్ల విస్తరణ పనుల వల్ల కనీస హెచ్చరిక బోర్డులు లేకపోవడం, శాస్త్రీయత లేని మలుపులు, యూటర్న్‌ల వద్ద రక్షణ చర్యలు కరువవ్వడమే కారణమని తెలుస్తోంది.

## భద్రతా ప్రమాణాలు ఎక్కడ ?

కేవలం డ్రైవర్ల తప్పుల వల్లే కాకుండా, రోడ్డు నిర్వహణ లోపాల వల్ల కూడా ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. మొగడంపల్లి మండలం సత్వర్ వద్ద జరిగిన ప్రమాదానికి ప్రధాన కారణం యూటర్న్. హైవేపై వాహనాలు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వస్తున్నప్పుడు, ఎలాంటి ముందస్తు హెచ్చరిక బోర్డులు లేకుండా సడన్‌గా యూటర్న్లు రావడం మరణశాసనంగా మారుతోంది. నేషనల్ హైవేస్ అథారిటీ గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ఇప్పటికీ సరైన బ్లింకర్ లైట్లు లేదా రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం సంగారెడ్డి కంది నుంచి మడిగెల్ వరకు జాతీయ రహదారి 65పై ఆరు లేన్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు తవ్వకాలు జరిపిన చోట, డైవర్షన్లు ఇచ్చిన చోట కనీస రేడియం సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు పెట్టడం లేదు. రాత్రి వేళల్లో లైటింగ్ లేకపోవడంతో డ్రైవర్లు అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. హైవే ఇరుపక్కలా ముఖ్యంగా హోటళ్లు, డాబాల వద్ద భారీ వాహనాలను (కంటైనర్లు, ట్యాంకర్లు) రోడ్డుపైనే ఇష్టానుసారంగా పార్క్ చేస్తున్నారు. వీటి వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలకు రోడ్డు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు వీటిని నియంత్రించడంలో విఫలమవుతున్నారు. అన్ని ప్రధాన క్రాసింగ్‌లు, యూటర్న్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించాలి. ఓవర్ స్పీడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌ను అడ్డుకోవడానికి స్పీడ్ గన్‌లు, సీసీ కెమెరాల నిఘా పెంచాలి. విస్తరణ పనులు జరుగుతున్న జోన్లలో రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించేలా ఎల్ఈడీ బ్లింకర్లను వెంటనే అమర్చాలి.





# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం
- నూతన కమిటీకి అభినందనలు
- టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ

## పటాన్‌చెరు జర్నలిస్టుల ఐక్యతకు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు



రామచంద్రపురం, ఆగస్టు 13 (సిరి న్యూస్): జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో యూనియన్‌ను మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని టీయూడబ్ల్యూజే-ఐజేయూ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నర్సింహా సమక్షంలో విరహత్ అలీని ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ.. పటాన్‌చెరులో ఇటీవల నిర్వహించిన జర్నలిస్టుల సమావేశం విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని ప్రశంసించారు. సంఘం పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసాన్ని పెంచేలా నూతన కార్యవర్గం పనిచేస్తోందని అభినందించారు. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టులను సంఘంలో భాగస్వాములను చేయాలని, వారి సమస్యల పరిష్కారానికి యూనియన్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



టీయూడబ్ల్యూజే- ఐ జేయూకు 75 ఏళ్ల ఘన చరిత్ర ఉందని, సంఘంలో పదవి అధికారం కాదని, బాధ్యత అని అన్నారు. క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేయాలని సూచించారు. త్వరలో పటాన్‌చెరులో తెలంగాణలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి జర్నలిస్టుల సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. బస్సు పాస్‌లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ తదితర సదుపాయాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా ప్రభుత్వ స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఆరోగ్యం, హక్కులు, గౌరవం, భద్రతకు యూనియన్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న జర్నలిస్టులు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక జర్నలిస్టు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని విరహత్ అలీ అన్నారు. అవసరమైన సందర్భాల్లో జర్నలిస్టులంతా ఐక్యంగా గొంతెత్తాలని పిలుపునిచ్చారు.

### పటాన్‌చెరు జర్నలిస్టుల కృషి మరువలేనిది

సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ.. పటాన్‌చెరు జర్నలిస్టుల సమిష్టి కృషి, సహకారంతోనే తాను జిల్లా స్థాయికి ఎదిగానని అన్నారు. పటాన్‌చెరు జర్నలిస్టులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ఉన్నత స్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు పత్తి నర్సింహా, ప్రధాన కార్యదర్శి యాదగిరితో పాటు కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అభినందించారు. నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న బసవేశ్వర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, చిన్న, మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్, పటాన్‌చెరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు శివకుమార్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఈసీ సభ్యులు శేఖర్, సిద్ధు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.







# వై జంక్షన్ మూసివేతకు చర్యలు ప్రారంభం

- బీజేపీ సుదీర్ఘ పోరాటం ఫలితం
- రెండు గ్రామాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవు
- సర్వీసు రోడ్డు ద్వారా నేరుగా రామాయంపేటకు చేరుకోవచ్చు
- స్పందించిన అధికారులు అందరికీ కృతజ్ఞతలు.
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న మైన శ్రీనివాస్

రామాయంపేట, ఆగస్టు 13 (సిరి న్యూస్ ) రామాయంపేట పట్టణంలోని వై జంక్షన్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భారతీయ జనతా పార్టీ చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా అధికారులు కీలక చర్యలు చేపట్టారు. నేడు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో బీజేపీ నాయకులు సంప్రదింపులు జరిపిన అనంతరం, జీఎంఆర్ అధికారులు లింకింగ్ లైట్స్‌ను సరిచేసి రేపటి వరకు వై జంక్షన్‌ను పూర్తిగా మూసివేస్తామని తెలియజేశారు.

ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చినమైన శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ, వై జంక్షన్ మూసివేత వల్ల కోమటిపల్లి, గొల్లిపర్తి గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని బీజేపీ తరఫున అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి కోమటిపల్లి సర్వీస్ రోడ్డు, గొల్లిపర్తి సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకొని పనులు కూడా ప్రారంభించడం అభినందనీయమన్నారు. కోమటిపల్లి నుంచి వచ్చే ప్రజలు సర్వీస్ రోడ్డు ద్వారా నేరుగా రామాయంపేటకు చేరుకునే అవకాశం ఉంటుందని, అలాగే గొల్లిపర్తి ప్రజలు సర్వీస్ రోడ్డు ద్వారా కేసీఆర్ కాలనీ ముందు నుంచి తమ పంట పొలాలకు వెళ్లే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వై జంక్షన్‌ను పూర్తిగా మూసివేసి ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. గతంలో ఈ ప్రాంతంలో జరిగిన వరుస ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ మొదటి నుంచే జంక్షన్ మూసివేత కోసం ఉద్యమాలు, నిరసనలు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ పోరాటం చేసిందని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వెంటనే స్పందించిన నేషనల్ హైవే అథారిటీ అధికారులకు, జీఎంఆర్ అధికారులకు, పోలీసు సిబ్బందికి, మున్సిపల్ అధికారులు మరియు పాలకవర్గానికి భారతీయ జనతా పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో వై జంక్షన్‌ను పూర్తిగా మూసివేసి ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రామాయంపేట పట్టణ ప్రజలతో పాటు కోమటిపల్లి, గొల్లిపర్తి గ్రామాల ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య, యాదగిరి మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కార్తిక్, ఓబీసీ సీనియర్ నాయకులు రాజేంద్ర ప్రసాద్, పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శి అనిల్ ప్రవీణ్ యూమోర్చ పట్టణ అధ్యక్షులు కన్నయ్య యువమోర్చా నాయకుడు వెంకటి, సోషల్ మీడియా కన్వీనర్ శ్యామ్ యువ మోర్చా నాయకుడు బాసమ్ అనిల్  పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో  చోరీ



తూప్రాన్ జులై 13 సిరి న్యూస్  తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో కామేష్ అనే పురోహితుని ఇంటికీ తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళగా తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కామేష్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులోని బంధువుల ఇంటికి బుధవారం బయలుదేరి వెళ్లి గురువారం రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువా లో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు 80 తులాల వెండి ఆభరణాల తోపాటు నాలుగు లక్షల రూపాయల నగదును గుర్తుతెలియని దొంగలు చొరబడి ఎత్తుకెల్లారని  పోలీసులకు ఫిర్యాదు చేశారు ఘటన స్థలానికి తూప్రాన్ సిఐ వెంకట్ రాజా గౌడ్ ఎస్ ఐ గంగరాజు వెళ్లి పరిశీలించి క్లూస్ టీం తో  ఆధారాలు సేకరించి త్వరలో నే దొంగలను పట్టుకుంటామని సిఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు  ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నా ఇంటిలో ఆభరణాలు నగదును విలువైన వస్తువులు ఇంట్లో కనిపించేలా ఉంచకూడదని ఎప్పటికప్పుడు పోలీస్ వారు సూచిస్తున్నా ఇంటికి తాళం వేసి ఎక్కువసేపు బయటకు వెళ్లే సమయంలో ఇరుగు పొరుగువారికి సమాచారం ఇవ్వాలని ఎన్నిసార్లు జాగ్రత్తలను తీసుకోవాలని చెప్పిన ప్రజలు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది పోలీసుల సూచన అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్వయంగా ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను సాధ్యమైనంతవరకు నివారించవచ్చు దొంగతనాలు జరిగిన తర్వాత బాధపడటం కంటే ముందే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది ప్రజలకు తూప్రాన్ పోలీస్ ల సూచనలు పాటిస్తూ రోజుల తరబడి దేవాలయాలకు శుభకార్యాలకు వెళితే గనుక ఆభరణాలు నగదును బ్యాంకులో భద్రపరుచుకోవాలని సమీప పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు